

ఏటీఎంలో భారీ చోరీ

రాంనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చోటు చేసుకుంది. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసిన దొంగలు రూ.14లక్షల వరకు ఎత్తుకెళ్లారు.

8లో▸



చదువు.. ర్యాంకులు..! 8లో▸

పోటీ చదువులు.. ర్యాంకులతో విద్యార్థులపై ఒత్తిడి పెరిగి తనువు చాలిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఈ క్రమంలో విద్యాసంస్థల్లో కౌన్సెలర్ల నియామకానికి 'సుప్రీం' సూచన చేసింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా జడ్జి ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: కోర్టు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా జడ్జి ప్రభాకరరావు అన్నారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో హైకోర్టు నుంచి శిక్షణ పొందిన టి.అశోక్ కోర్టు సిబ్బందికి శనివారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. అలసత్వం, నిర్లక్ష్యం వీడాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జీలు రాజ్యలక్ష్మి, హుస్సేన్, కుమార్ వివేక్, ఏవో సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం ర్యాగింగ్ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సరదా కోసం చేసే ర్యాగింగ్ తోటి విద్యార్థుల భవిష్యత్తుపై పెను ప్రభావం చూపుతుందన్నారు. ర్యాగింగ్‌తో ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కల్పించారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం, అశోక్, ఉమేష్, ప్రిన్సిపాల్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జావెలిన్ త్రో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 28న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జావెలిన్ త్రో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేశ్ ప్రకటనలో తెలిపారు. అండర్–8, 10, 12, 14, 16, 18 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టు 7న జనగామలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరగాళ్లు అనేక మార్గాల్లో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారని, ఈ మేరకు ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. గడిచిన వారం వ్యవధిలో సైబర్ నేరాలకు సంబంధించి 14 ఫిర్యాదులు అందాయని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో ఉన్న వారిని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ ఉచ్చులోకి దించి డబ్బు కాజేస్తున్నారని తెలిపారు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ఫ్రాడ్, సోషల్ మీడియా ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్ వంటి మోసాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విధుల్లో చేరిన ముగ్గురు రిమ్స్ ప్రొఫెసర్లు



డైరెక్టర్‌కు రిపోర్టు చేస్తున్న ప్రొఫెసర్ అశోక్

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన ముగ్గురు వైద్యులు శనివారం రిమ్స్ ఆసుపత్రిలో విధుల్లో చేరారు. జనరల్ సర్జన్ ప్రొఫెసర్ అశోక్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ తానాజీ జాడే, పీడియాట్రిక్ ప్రొఫెసర్ ఎస్.కవిత ఉదయం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి రిపోర్టు చేశారు. తొమ్మిది మందిని రిమ్స్‌కు కేటాయించగా ముగ్గురు విధుల్లో చేరారు. మరో ఆరుగురు చేరాల్సి ఉంది. అనంతరం రిమ్స్ వైద్యులు, సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఆదిలాబాద్‌టౌన్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాందేవ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. తమపై అసభ్యంగా ప్రవర్తించినట్లుగా విద్యార్థులు ఇటీవల షీటీం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయనపై ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఈ క్రమంలో సదరు ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.



జిల్లా అధికారులతో సమీక్షలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ హరికిరణ్, పక్కన కలెక్టర్ రాజర్షి షా



అప్రమత్తం..

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 21న హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందులో భాగంగా కలెక్టర్ల ఖాతాల్లోకి రూ.కోటి విడుదల చేస్తానని ఆ రోజు పేర్కొన్న విధంగానే శనివారం ఆ నిధులు జమ చేశారు.

- సీఎం ఆదేశాలతో క్షేత్రస్థాయిలోకి అధికారులు
- స్పెషల్ ఆఫీసర్ కూడా రంగంలోకి..
- వర్షాల నేపథ్యంలో అలర్ట్

సాక్షి, ఆదిలాబాద్: సీఎం ఆదేశాలతో జిల్లా యంత్రాంగంలో అటెన్షన్ కనిపిస్తోంది. కలెక్టర్ రాజర్షి షా మరింత దూకుడు పెంచారు. ఇటీవల తనిఖీలు ముమ్మరం చేశారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలంటూ అధికారులతో సమీక్షలు నిర్వహించి ఇప్పటికే యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా శుక్రవారం నియమితులైన హరికిరణ్ శనివారం నుంచే జిల్లాలో తన పర్యటన ప్రారంభించారు. ఇలా సీఎం ఆదేశాలు అధికారులను క్షేత్రస్థాయికి కదిలేలా చేశాయి.

వర్షాల నేపథ్యంలో ..

రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. అలాగే వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, రేషన్ కార్డుల పంపిణీలో పురోగతిపై కూడా సమీక్షించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజర్షి షా విస్తృత పర్యటనలు చేస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.



ఇచ్చోడ పీఏసీఎస్‌ను శుక్రవారం తనిఖీ చేసిన క్రమంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

రేషన్‌కార్డుల పంపిణీ

కొత్త రేషన్‌కార్డుల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జిల్లాలో శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ మొదలైంది. ఇదిలా ఉంటే ఈ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 28న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు రానున్నారు. వీటితో పాటు ప్రభుత్వం ప్రాధాన్యత కార్యక్రమాల పురోగతిపై దృష్టి సారించాలనే ఆదేశాలున్నాయి. మొత్తంగా ప్రభుత్వం తమ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు విషయంలో సూక్ష్మంగా గమనిస్తుండటంతో అధికారులు ఆ ప్రక్రియలో లీనమవుతున్నారు.

జిల్లాకు స్పెషలాఫీసర్

- అధికారులతో సమీక్ష
- సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా

కైలాస్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారిగా నియామకమైన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి హరికిరణ్ శనివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు కలెక్టర్ రాజర్షిషా, ఇతర అధికారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా అమలు చేస్తున్న పథకాలను పక్కాగా లబ్ధిదారులకు అందించేలా చూడాలన్నారు భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్, ట్రైయినీ కలెక్టర్ సలోని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ అటెన్షన్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్సైజ్‌శాఖపరంగా అటెన్షన్ వాతావరణం కనిపిస్తుంది. దీనికి కారణం లేకపోలేదు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న జూపల్లి కృష్ణారావు రాష్ట్రంలో ఎక్సైజ్‌శాఖ మంత్రిగా ఉన్నారు. మరో పక్క ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన హరికిరణ్ ఎక్సైజ్‌శాఖ రాష్ట్ర కమిషనర్. దీంతో మంత్రి వచ్చినా, కమిషనర్ వచ్చినా ఉమ్మడి జిల్లా ముఖ్య అధికారులంతా ప్రొటోకాల్ ప్రకారం అక్కడ ఉండాల్సిందే.

'స్వచ్ఛ' నిధులొచ్చాయ్..

- బల్దియాకు రూ.73 లక్షలు విడుదల
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టేందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2.0 కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.73లక్షలను కేటాయించింది. జనాభా ప్రతిపాదికన ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో ఈ నిధులు కేటాయిస్తున్నాయి. వీటితో పట్టణ పరిధిలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను బల్దియా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య అంశాలకే వీటిని వెచ్చించాల్సి ఉన్నందున ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ..

ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధిపై కలెక్టర్ రాజర్షి షా శనివారం సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ నిధుల విడుదలపై ఆరా తీయడంతో పాటు నిధుల వినియోగంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. పట్టణంలోని వివిధ కాలనీల్లో చెత్త సేకరణ కోసం కొత్తగా ఆరు ఆటో ట్రాలీల కొనుగోలుతో పాటు బహిరంగ మల విసర్జన ఎక్కువగా ఉన్న కాలనీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో బల్దియా అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే టెండర్లు ఆహ్వానించాలని భావిస్తున్నారు. పట్టణంలోని ఏయే కాలనీల్లో బహిరంగ మలవిసర్జన ఎక్కువగా ఉందనే దానిపై సర్వే చేపట్టాలని నిర్ణయించారు. దాని ఆధారంగా గుర్తించిన కాలనీల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ప్రధానంగా బంగారుగూడ, కేఆర్‌కే కాలనీ, ఖానాపూర్, రణదీవేనగర్, గాంధీనగర్, చిల్కూరి లక్ష్మీనగర్ వంటి పలు కాలనీల్లో బహిరంగ మల విసర్జన ఎక్కువగా ఉంటుంది. ఆయా కాలనీల్లో ఈ నిధులతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం ద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశమేర్పడనుంది. ఈ నిర్మాణాల కోసం టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. తక్కువ బిడ్ దాఖలు చేసిన వారికి పనులు అప్పగించనున్నారు.

త్వరలోనే టెండర్ల ప్రక్రియ..

స్వచ్ఛ సర్వేక్షణ్ కింద విడుదలైన నిధులతో చేపట్టే పనుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వాటి ఆధారంగా టెండర్లు ఆహ్వానిస్తాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
– పేరిరాజు, మున్సిపల్ ఇంజినీర్

సైనికుల కుటుంబాలను గౌరవించాలి



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: దేశ రక్షణకు పాటుపడుతున్న సైనికుల కుటుంబాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కార్గిల్ అమరవీరుల స్తూపం వద్ద శనివారం ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో మన సైనికులు ఘనవిజయం సాధించారన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో సైతం శత్రు దేశాలకు బలమైన సందేశం ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, కార్గిల్ అమరవీరుల త్యాగాలను కొనియాడారు. అనంతరం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, ఐరిస్ ఫ్లోరిస్ పాఠశాల విద్యార్థులు, సామాజికవేత్త ముడుపు మౌనిష్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఇందులో ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర దాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు దినేష్ మటోలియా, లాలా మున్నా, ప్రవీణ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



చరణ్‌తేజ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన కొమ్ము చరణ్ తేజ్ జాతీయస్థాయి వాటర్ పోలో పోటీలకు ఎంపికైనట్లు జిల్లా స్విమ్మింగ్ ఆక్వాటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ జీత్ కుమార్ తెలిపారు. ఆగస్టు 4నుంచి 8వరకు బెంగుళూరులో నిర్వహించనున్న 51వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, స్విమ్మింగ్ శిక్షకులు కొమ్ము కృష్ణ తదితరులు అభినందించారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న డీఐఈవో గణేశ్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు పట్టికలను పరిశీలించారు. అకాడమిక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు రూ.4కోట్లు మంజూరు

- నిర్మల్ కలెక్టర్ లేఖకు రాష్ట్ర ప్రభుత్వ స్పందన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భారీ వర్షాలు, ఆపదకాల అత్యవసర ఖర్చుల కోసం ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.4కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ నిధులు విడుదల చేసింది. ఈ నిధులు జిల్లాల్లో వానాకాలంలో ఆపద సమయంలో ఉపయోగించే సామగ్రి, ఇతర అవసరాల కోసం ఖర్చు చేసేందుకు ఉపయోగపడనున్నాయి. ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యవసర నిధుల కోసం ప్రతిపాదనలు చేస్తూ లేఖ రాయగా ఈ మేరకు ప్రభుత్వం స్పందించింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న తీరు, ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలోనూ రూ.కోటి మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ల వద్ద ఉండే ఈ అత్యవసర నిధితో ఎయిర్ బోట్స్, లైఫ్ జాకెట్స్, సైరన్స్, తాళ్లు, గ్యాస్ కట్టర్స్, నిచ్చెనలు తదితర వరదలతో ప్రమాదాలు ఏర్పడినప్పుడు ఉపయోగించే సామగ్రిని కొనుగోలు చేయనున్నారు. ఆపద మిత్ర స్వచ్ఛంద సేవకులు, రెవెన్యూ విపత్తు నిర్వహణ సిబ్బందికి ఈ సామగ్రి ఎంతగానో ఉపయోగపడనుంది.



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతూ..

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఆదిలాబాద్‌రూరల్: నాటిన మొక్కలను సంరక్షించాలని డీఆర్డీవో రాథోడ్ రవీందర్, మావల మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు అన్నారు. వనమహోత్సవం భాగంగా శనివారం మావల మండలంలోని వాఘాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'సర్వేయర్', జీపీవో రాత పరీక్ష

- హాజరుకానున్న 206 మంది అభ్యర్థులు
- జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్, గ్రామ పాలనాధికారి (జీపీవో) పోస్టుల నియామకాలకు సంబంధించిన రాత పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 206 మంది హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు గాను రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 155 మంది హాజరుకానున్నారు. వీరికి స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష ఉంటుంది. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్లాటింగ్ పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులను ఉదయం 9.30 నుంచే కేంద్రంలోకి అనుమతిస్తామని పరీక్షల అబ్జర్వర్, కె.రాజలింగు తెలిపారు. ఏర్పాట్లను జిల్లా కోఆర్డినేటర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ అతీక్‌బేగంతో కలిసి ఆయన పరిశీలించారు. శిక్షణలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన సామగ్రిని మాత్రమే వెంట తీసుకురావాలని ఇతర పరికరాలేవీ తీసుకురావద్దని సూచించారు. అలాగే జీపీవో నియామక పరీక్షను పట్టణ శివారులోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 51 మంది హాజరుకానున్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

- హాకా జీఎం వెంకటేశ్వర్లు

ఇచ్చోడ: జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని హాకా జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. ఇచ్చోడ సహకార సంఘం గోదాంను శనివారం ఆయన పరిశీలించారు. యూరియా పంపిణీపై జిల్లాలో తనిఖీలు నిర్వహించేందుకు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నేరడిగొండలోని సహకార సంఘం, బోథ్‌లో ప్రైవేట్ ఎరువుల దుకాణం, ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. యూరియా సరఫరా చేసే దుకాణాల వద్ద తప్పనిసరి స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సహకార సంఘాలు ఉదయం 8 గంటలకే తెరిచి ఉంచాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద మార్కెటింగ్ రవాణా శాఖల సిబ్బంది అందుబాటులో ఉండి నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. ఎమ్మార్పీకి మించి యూరియా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డీఏవో శ్రీధర్ స్వామి, ఇచ్చోడ ఏడీఏ రాంకిషన్, ఏవో రమేశ్, నిర్మల్ జిల్లా హాకా మేనేజర్ ఉమాపతి,ఏఈవో సంజీవ్‌నాయక్, సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తదితరులున్నారు.



రైతుతో మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్లు

నేరడిగొండ పీఏసీఎస్ తనిఖీ

నేరడిగొండ: మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంను హాకా జీఎం వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న ఎరువులతో పాటు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి, సిబ్బంది తదితరులున్నారు.

క్లుప్తంగా

చుక్కలదుప్పిని వేటాడిన వారిపై విచారణ

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పిని వేటాడిన ఘటనలో గ్రామానికి చెందిన నలుగురిని అదుపులో తీసుకున్నట్లు ఎఫ్‌ఆర్వో అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పక్కా సమాచారంతోనే విగ్నేష్, జలపతి, బాపు, బాపురావులను అదుపులో తీసుకుని విచారిస్తున్నామని పేర్కొన్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురు పట్టివేత

రెబ్బెన: మండలంలోని ఎడవెల్లిలో పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రియల్ వ్యాపారిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాలా కన్వర్షన్ భూమి అంటూ విక్రయించిన రియల్ వ్యాపారిపై శనివారం కేసు నమోదు చేసినట్లు హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మందమర్రికి చెందిన కంపాటి బసవేశ్వర్ అనే రియల్ వ్యాపారి హాజీపూర్ మండలం దొనబండ శివారులోని ఓ వెంచర్‌లో గోదావరిఖనికి చెందిన ఓ మహిళకు నాలా కన్వర్షన్ ఉందని ఓ ప్లాట్‌ను విక్రయించాడు. కొనుగోలు చేసిన అనంతరం ఆ మహిళ ఆరా తీయగా ఆ ప్లాట్‌కు నాలా కన్వర్షన్ లేదని తెలుసుకుంది. తనను మోసగించారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యంతో సిబ్బంది

భీంపూర్: మహారాష్ట్ర కనికి నుంచి మండలంలోని పాక్డిగూడ గ్రామానికి అక్రమంగా దేశీదారును తరలిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై పీర్‌సింగ్ నాయక్ తెలిపారు. తొడ్సం వెంకట్రావు, ఆత్రం మోతీరామ్ బైక్‌పై దేశీదారు తీసుకువస్తున్నారని పక్కా సమాచారంతో లింగూడ గ్రామ శివారులో అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి 50 దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బైక్ సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. చాకచక్యంగా ఇద్దరిని పట్టుకున్న సీఐ, ఎస్సైతోపాటు హెడ్ కానిస్టేబుల్ గంగారెడ్డి, మధుకర్‌ను డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

చెట్టును ఢీకొట్టిన కారు




ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్వేత

భీమారం: మండలంలోని మాంతమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. మంచిర్యాలకు చెందిన సంగోజీ రామకృష్ణ, కట్ట శాంతిప్రియ కారులో చెన్నూర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడ్డ ఇద్దరిని అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

చదువు.. ర్యాంకులు..!

- 'ప్రైవేటు'లో విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి
- అధిగమించలేక తనువు చాలిస్తున్న వైనం
- విద్యాసంస్థల్లో కౌన్సెలర్ల నియామకానికి 'సుప్రీం' సూచన



మంచిర్యాలఅర్బన్: పోటీ చదువులు.. ర్యాంకులతో విద్యార్థులపై ఒత్తిడి పెరిగిపోతోంది. ఒకటో తరగతి నుంచి మొదలు ఉన్నత విద్య వరకు తరగతుల్లో ఇటు విద్యాసంస్థలు అటు తల్లిదండ్రులు ర్యాంకులనే చదువుకు ప్రామాణికంగా తీసుకుంటుండడం విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది. చదువులో వెనుకబడ్డామని, ఫెయిలయ్యామని విద్యార్థులు అర్ధంతరంగా ఆయుష్షు తీసుకోవడం తల్లిదండ్రులకు తీరని దుఃఖం మిగులుస్తోంది. విశాఖలో నీట్ విద్యార్థిని మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ విద్యార్థుల ఆత్మహత్యలను నిలువరించాలని సూచనలు చేసింది. వంద మంది విద్యార్థులున్న ప్రతీ విద్యాసంస్థలో మానసిక కౌన్సెలర్లను నియమించడం తప్పనిసరి అంటూ మార్గదర్శకాలు వెలువరించింది. జిల్లాలోనూ విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు చోటు చేసుకున్నాయి. నస్పూర్‌లో ఓ ఇంటర్ విద్యార్థిని సెకండియర్ ఫెయిలు కావడంతో మనస్తాపం చెంది ఉరేసుకుంది. దండేపల్లికి చెందిన విద్యార్థి బీటెక్ చదవడం ఇష్టం లేదంటూ ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. లక్సెట్టిపేటకు చెందిన విద్యార్థిని స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధమై ఆకస్మాత్తుగా ఉరేసుకుంది. ఇటీవల మంచిర్యాలలో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకోవడం కలకలం రేపింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు 1,138 ఉన్నాయి. వీటిల్లో 1,34,429మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. మానసిక కౌన్సెలర్లను నియమిస్తే విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు, అధ్యాపకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అనేక కారణాలు..



పరీక్షల భయం, చదువులో పోటీ, పరిశీలన లేకపోవడం, కాలేజీ మేనేజ్‌మెంటు లోపం, స్నేహితుల ప్రభావం ఒత్తిడికి కారణాలు. ఆరోగ్యకరమైన జీవన శైలి, పౌష్టికాహారం తీసుకోవడం, నిద్రను విస్మరించరాదనే విషయాన్ని మరిచిపోకూడదు. యోగా, ధ్యానం సాధన చేయాలి. సోషల్ మీడియా వాడకాన్ని పరిమితం చేయటం, సరైన జీవన శైలి, సానుకూల దృక్పథం, సమయపాలనతో ఒత్తిడిని అధిగమించవచ్చు. యోగా లేదా స్ట్రెచింగ్‌తో ఒత్తిడిని జయించవచ్చు. ఇంటర్‌లో టెలిమానస్ 14416ద్వారా విద్యార్థులు మానసిక ఇబ్బందులు అధిగమించి పరీక్షల్లో సక్సెస్‌కు ఎంతో దోహదం చేసింది.

– సునీల్, మానసిక వైద్యనిపుణులు

తొందరపాటు నిర్ణయాలు సరికాదు



విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలతో ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆర్థిక వనరుల లభ్యత పెరగడం పిల్లలను అతి గారబంగా పెంచడం.. గెలవడమే పరమావధిగా తల్లిదండ్రులు ఆంక్షలు విధించడం వారి ఆత్మహత్యలకు కారణం. విద్యావ్యవస్థలో ర్యాంకులు, కేరియర్లు మాత్రమే ప్రాధ్యానత సంతరించుకుని మార్కెట్‌లో యంత్రాలు తయారు చేసేలా విద్యావ్యవస్థ ఉండడం మానసికంగా ధైర్యవంతులైన విద్యార్థులను తయారు చేయలేకపోతోంది.

–ఆచార్య చక్రపాణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఒత్తిడిని జయించడానికి..



విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడానికి కళాశాలలో స్టూడెంట్ కౌన్సెలర్, ప్రిన్సిపాల్ మోటివేషన్ అవసరం. యోగా, ఆటలు, క్విజ్ వేదికపై మాట్లాడడం కూడా ఉపయోగకరం. డ్రాయింగ్, క్విజ్, చెస్, ప్రకృతి సంరక్షణ, శారీరక శ్రమ కార్యక్రమాలు మా కాలేజీలో నిర్వహిస్తున్నారు.

– కల్పన, విద్యార్థి, బైపీసీ ద్వితీయ సంవత్సరం

యోగా, ధ్యానం అవసరం



విద్యార్థుల్లో చదువుపై ఒత్తిడి పెరుగుతోంది. కార్పొరేట్ కళాశాలల్లో మరింత ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి జయించేందుకు తప్పనిసరిగా మైదానంలో ఆటలు, యోగా, మానసిక ఉల్లాసం కలిగించే ఆటలు ఎంతో అవసరం. ప్రతీ విద్యార్థికి కౌన్సెలర్ ద్వారా మానసిక స్థితిని గుర్తించి కౌన్సెలింగ్ చేయాలి.

– సతీశ్, పేరెంట్

విద్యపై ఇష్టం ఏర్పర్చాలి



విద్యార్థులు చదువు అంటేనే ఎంతో ఒత్తిడి ఉంటుంది. కళాశాలకు వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు ఎన్నో ఉంటాయి. హాస్టల్‌లో ఉండే విద్యార్థులపై తీవ్ర ప్రభావం ఉంటుంది. శారీరక శ్రమ లేకపోవడం.. మానసిక ఉల్లాసానికి దూరంగా ఉంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునే పరిస్థితులు ఏర్పర్చాలి.

– లక్ష్మణ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ అనిత

జైపూర్: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. స్టోర్‌రూమ్, ల్యాబ్ పరిశీలించి అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, రోగులకు అవసరమైన రక్తపరీక్షలు చేయాలని తెలిపారు. పిల్లలకు అందించే వ్యాక్సిన్స్ పరిశీలించారు. దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రతతో దోమలు వ్యాప్తి చెందుతాయని, దోమలు కుట్టడం మూలంగా డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



ఆయిల్‌పాం తోటలను పరిశీలిస్తున్న అనిత, సహజ

దండేపల్లి: మామిడి, ఆయిల్‌పాం తోటల రైతులు ఇప్పటి నుంచే సస్యరక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానవన అధికారి అనిత సూచించారు. దండేపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో మామిడి, ఆయిల్‌పాం తోటలను శనివారం ఆమె పరిశీలించారు. తోటల్లో అంతర పంటగా కంది, పెసర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. క్లస్టర్ అధికారి సహజ పాల్గొన్నారు.

సీఆర్టీ పరీక్షను పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: నేడు జరిగే సీఆర్టీ అర్హత పరీక్షను పకడ్బందీగా చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. స్థానిక కుమురం భీం కాంప్లెక్స్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఎస్‌డీసీ గంగాధర్, డీడీ అంబాజీ, ఈపీవోపీవీటీజీ మనోహర్, పీహెచ్‌వో సందీప్ కుమార్, డీఎంజీసీసీ, ఏసీఎంవో జగన్‌తో కలిసి ఇన్విజిలేటర్లు, చీఫ్ స్పెషల్ ఆఫీసర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షకు 2200 మంది అభ్యర్థులు హాజరవతారని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. గంట ముందుగానే కేబీ కాంప్లెక్స్ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఓటర్ ఐడీ, ఆధార్ కారు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదైనా ఒకటి తీసుకురావాలని సూచించారు. సెల్ ఫోన్లు, స్మార్ట్‌వాచీలు అనుమతి లేదన్నారు. ప్రతి హాళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఏటీఎంలో భారీ చోరీ

- గ్యాస్ కట్టర్‌తో మెషీన్‌ను కట్ చేసిన దొంగలు
- రూ.14 లక్షల వరకు ఎత్తుకెళ్లిన వైనం
- ఆదిలాబాద్‌లో ఘటన



చోరీకి గురైన ఏటీఎం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్‌స్టేషన్ పరిధి రాంనగర్‌లో గల ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం వేకువజామున భారీ చోరీ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఉదయం 3.45గంటల ప్రాంతంలో ఏటీఎం నుంచి పొగలు రావడంతో నైట్ డ్యూటీ బీట్ కానిస్టేబుల్ గమనించాడు. సమాచారం అందించడంతో సీఐ కర్రె స్వామి, సునీల్ కుమార్‌తో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. దొంగలు బొలెరోలో వచ్చినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. సీసీ ఫుటేజీలు రికార్డు కాకుండా విద్యుత్ వైర్లు కట్ చేయడంతో పాటు కెమెరాలకు బ్లాక్ స్ప్రే చేసినట్లు తెలిపారు. అలారం మోగకుండా కేబుల్స్ కట్ చేసి ఏటీఎం బాక్సులను గ్యాస్ కట్టర్‌తో తొలగించి అందులో ఉన్న సుమారు రూ.14 లక్షల వరకు నగదు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించామని, దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక పారిపోయిన విద్యార్థి



రితేశ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్: హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక పారిపోయిన విద్యార్థిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మణచాంద మండలం నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన కస్తూరి రితేష్ దిలా వర్‌పూర్ మండలం సిర్గాపూర్ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతూ హోంసిక్‌లో భాగంగా ఇటీవల ఇంటికి వచ్చాడు. సెలవులు పూర్తికావడంతో హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక ఇంట్లో చెప్పకుండా పారిపోయి ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామానికి వచ్చాడు. శని వారం అటుఇటు తిరుగుతూ గ్రామస్తులకు కని పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోకార్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ శ్యాంరావు, కానిస్టేబుల్ సుధీర్ అక్కడికి చేరుకుని విద్యార్థి వివరాలు తెలుసుకుని కుటుంబీకులకు అప్పగించారని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

దాడి చేసిన ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: యువకుడిపై దాడి చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌కుమార్ తెలిపారు. కుమార్‌పేటకు చెందిన జి.ప్రణీత్ అనే యువకుడిని భాగ్యనగర్‌కు చెందిన అడ్డి అనుదీప్, అడ్డి కృష్ణారెడ్డిలు మే 21న ఆదిలాబాద్ పాత బస్టాండ్‌కు పిలిపించి దాడి చేయడంతో గాయపడ్డాడు. ఇదివరకు కేసు నమోదు చేయగా కోర్టు అనుమతితో నిందితులను ఎస్సై రమ్య శని వారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇంద్రవెల్లి హెచ్‌ఎంకు చార్జీ మెమో

ఆదిలాబాద్‌టౌన్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంమోహన్‌కు వరంగల్ ఆర్జేడీ సత్యానారాయణరెడ్డి చార్జీ మెమో జారీ చేశారు. ఇటీవల ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. పీఎం శ్రీ నిధులతోపాటు ఇతర నిధులను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్.. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను విచారణాధికారిగా నియమించారు. సబ్ కలెక్టర్‌కు హెచ్‌ఎం సరైన రికార్డులు చూపించలేదని విచారణలో స్పష్టమైంది. హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డీఈవో శ్రీనివాసరెడ్డి ఆర్జేడీని కోరారు. ఈమేరకు సదరు హెచ్‌ఎంకు చార్జీ మెమో జారీ చేశారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



మల్లేశ్ మృతదేహం

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని ఎల్కరి మల్లేశ్ కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఏఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. బ్రహ్మన్‌చిచ్యాల గ్రామశివారులో పొలంలో శనివారం కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌తో పని పూర్తి చేశాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లడానికి బయటకు వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఎల్కరి రాజక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కూతురు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఖానాపూర్: మంచెను.. ఉరికి కొయ్యగా చేసుకుని రైతు ఆర్థిక ఇబ్బందులతో తన చేనులో తనువు చాలించాడు. మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంగ రాములు (65).. భార్య యశోద అనారోగ్యం బాధపడుతోంది. చికిత్స కోసం అప్పులు చేశాడు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడక ఏడాది క్రితం భార్య మృతిచెందింది. చేసిన అప్పులు తీరలేదు. దీంతో కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. శనివారం తన చేనులో మంచెకు నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. సుర్జాపూర్ నుంచి మొదటిసారి ఫ్లైట్ ఎక్కి మస్కట్ వెళ్లిన వ్యక్తిగా పేరుంది. మస్కట్ రాములు అని గ్రామస్తులు పిలుస్తారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రైలు కిందపడి ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సంజీవయ్య కాలనీకి చెందిన ఇగురుపు శ్రీనివాస్(40) శనివారం గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని, ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'సోయం'కు విమర్శించే స్థాయి లేదు

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: మాజీ ఎంపీ సోయం బాపూరావుకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) నాయకత్వాన్ని విమర్శించే స్థాయిలేదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ పేర్కొన్నారు. మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతం కుమురం భీంగూడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ఆదివాసీ హక్కుల కోసం తుడుందెబ్బ పోరాటాలు చేస్తోందన్నారు. స్వార్థ రాజకీయం కోసం సోయం బాపూరావు ఆదివాసీలు, తుడుందెబ్బను అడ్డుపెట్టుకొని వివిధ పార్టీల్లో చేరి పదవులు అనుభవించారన్నారు. ప్రస్తుతం విలాసవంతమైన జీవితం గడుపుతూ తుడుందెబ్బ నాయకత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. అతనితో రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు ఇందిరా, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరుణ్, నాయకులు గణపతి, ముకుంద్, ఆనంద్‌రావు, కేశవ్‌రావు, సంజు, ప్రకాశ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

స్వార్థ రాజకీయల కోసమే విమర్శలు

ఇంద్రవెల్లి: మాజీ ఎంపీ సోయం బాపూరావ్ తన స్వార్థ రాజకీయల ప్రయోజనాల కోసం తుడుందెబ్బపై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ పేర్కొన్నారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నాయకులు శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. జీవో 49 రద్దు, భవిష్యత్ ఉద్యమ ప్రణాళిక, మాజీ ఎంపీ ఆదివాసీ సమాజానికి చేసిన మోసాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తానని కుల దేవతలు, కన్న తల్లిదండ్రులపై సోయం బాపూరావ్ ప్రమాణం చేసి ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచి ఆదివాసీలను మర్చిపోయావని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు భరత్, విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్, నాయకులు జాలిం, జుగాదిరావ్, భీంరావ్, నాగోరావ్, మారుతి, ధర్ము ఉన్నారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థకు రాష్ట్రప్రభుత్వ సంస్థల నుంచి రావల్సిన రూ.39 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని ఆర్కే 5 గనిలో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. జెన్కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి రావాల్సిన ఈ బకాయిలు చెల్లించకపోవడంతో కంపెనీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని సంస్థ పాలన గాడి తప్పిందని, దీనివల్ల సంస్థ మనుగడకు ప్రమాదం పడిందన్నారు. కంపెనీలో బొగ్గు ఉత్పత్తి పెరుగుతుందని, కానీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందన్నారు. పర్మినెంట్ ఉద్యోగులను క్రమంగా తగ్గిస్తూ వస్తున్న యజమాన్యం వారి స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగులను నియమించుకుంటుందన్నారు. ప్రతి పని ఔట్‌సోర్సింగ్ చేస్తున్నారన్నారు. 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన సవరణ జరగలేదన్నారు. కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్ చేయాలని, ఇంకా ఇతర ప్రధాన డిమాండ్లు, సంస్థ పరిరక్షణ కోసం ఈనెల 24 నుంచి సెప్టెంబర్ 15 వరకు దశలవారీగా ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, కార్యదర్శి రవీందర్, హరి, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి రాజేందర్, నాయకులు శ్రీకాంత్, స్వామి, మహేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తివేత



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు శనివారం 10,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు రెండు వరద గేట్లు ఎత్తి 10,138 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 694.850 అడుగులుగా ఉంది. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో భారీ కురిసింది. అటవీ ప్రాంత గ్రామాలైన గంగాపూర్, అల్లంపల్లి, మిద్దెచింత, ఇస్లాంపూర్, గండిగోపాల్‌పూర్ వెళ్లే దారిలో వాగులు పొంగిపొర్లాయి.